రోడ్ల అభివృద్ధికి 850 కోట్లు

- మంజూరు చేసిన కేంద్ర సర్కారు
- 31 రాష్ట్ర రహదారులను 435 కి.మీ.మేర అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో 31 రాష్ట్ర రహదారుల విస్తరణ, ఆధునికీకరణ పనుల కోసం కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ రూ.850 కోట్లు మంజూరు చేసింది. సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఎఫ్ఐ) కింద రాష్ర్టానికి నిధులు కేటాయించింది. ఈ నిధులతో 31 రహదారులను 435.29 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. దీనివల్ల రాష్ట్రంలో స్థానిక పర్యాటకం, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. పర్యాటక అభివృద్ధిని ప్రోత్సహించడం, రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరుచడం వల్ల కొత్త ఉద్యోగావకాశాలు కూడా లభిస్తాయని వెల్లడించారు. జిల్లాల వారీగా సుమారు 31 సింగిల్ లేన్ రోడ్లను డబుల్ లేన్ రోడ్లుగా మార్చేందుకు, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం తదితర జిల్లాల్లో రహదారులపై పదికి పైగా వంతెల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించిన ఆర్అండ్‌బీ శాఖ, నిధుల కోసం ఇటీవలే కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించింది. రోడ్లకు రూ.801.28 కోట్లు, వంతెనలకు రూ.335.30 కోట్లు కలిపి మొత్తం రూ.1,136.58 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించారు. ఈ నేపథ్యంలో కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ గురువారం సీఆర్ఎఫ్ఐ కింద రూ.850 కోట్లు మంజూరు చేసింది. దాంతో సూర్యాపేటలో ఐడీవోసీ సూర్యాపేట-బీబీగూడెం అలాగే నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో బొమ్మకల్ రోడ్డు వయా మంగాపురం, మునుగోడు-నాంపల్లి రోడ్డు, పీడబ్ల్యూడీ రోడ్డు-నాంపల్లి వయా పస్నూర్ రోడ్డు డబుల్ లేన్ రోడ్డుగా మారనున్నాయి.

పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్ : పెదనెమిలలో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్, మార్చి 14 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం మండలంలోని పెదనెమిల, దిర్శనపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజలు పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునిత, ఎంఈఓ రాములునాయక్, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జెన్నారెడ్డి వివేక్ రెడ్డి, మండలాధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. అర్వపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.22 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పాఠశాలలో కలియతిరిగి ఉపాధ్యాయులు, విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో జాజిరెడ్డిగూడెం, నాగారం మండలాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుకా లక్ష్మీ నర్సయ్యయాదవ్, తాసీల్దార్లు జక్కర్తి శ్రీనివాస్, బ్రహ్మయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ సందీప్‌కుమార్, ఎంఈఓ బాలూనాయక్, ఎస్ఐ మహేంద్రనాథ్, హెచ్ఎం నర్సయ్య, కేజీబీవీ ఎస్ఓ నాగరాణి, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్య పరిరక్షణ

- ఎంపీపీ వెంకటేశ్వర్లు

అనంతగిరి : చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వర్లు

అనంతగిరి, మార్చి 14 : చిరు ధాన్యాలతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధన్యతని ఇస్తుందన్నారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అంగన్‌వాడీ టీచర్లు చిరు ధాన్యాల వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో తాసీల్దార్ రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగమ్మ పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల అంగన్‌వాడీ కేంద్రం-3లో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు పౌష్టికాహారం లోపం వల్ల కలిగే ఇబ్బందులను బాలింతలు, మహిళలకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఎలిజబెత్ రమణ, చంద్రకళ, ఆశ వర్కర్ శోభ పాల్గొన్నారు.

తిరుమలగిరి : మండలంలోని తొండ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాణ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులకు ప్రీ ప్రైమరీ విద్య ప్రాముఖ్యతను వివరించారు. అలాగే రక్తహీనతకు గురికాకుండా ఆహారంలో చిరు ధాన్యాల ప్రాధాన్యతను తల్లులకు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

- డీఎంహెచ్ఓ కోటాచలం

సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ

సూర్యాపేట టౌన్, మార్చి 14 : ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన అవసరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కోటాచలం అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో వద్ద గురువారం స్థానిక వెన్నెల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం విధి నిర్వహణలో పని ఒత్తిడి కారణంగా ఉద్యోగుల్లో గుండెకు సరైన రక్త ప్రసరణ లేక ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. వెన్నెల ఆస్పత్రి జనరల్ చాతి వైద్య నిపుణుడు నరేశ్ మామిడి మాట్లాడుతూ.. హృదయ సంబంధమైన సమస్య వస్తే 108కి కాల్ చేసి ఆ వ్యక్తికి నిమిషానికి 100 సార్లు సీపీఆర్ చేయాలని, నుదుటి భాగాన్ని చేత్తో పట్టుకుని 30 సార్లు నోట్లో ఊదడం ద్వారా ఆక్సిజన్ అందించవచ్చని దాంతో కొన్ని నిమిషాల పాటు ఆ వ్యక్తిని కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ డి.సురేందర్, ఆస్పత్రి ఎండీ భయ్యా దయాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఎంఈఓ చత్రూనాయక్

గరిడేపల్లిలో మాట్లాడుతున్న ఎంఈఓ చత్రూనాయక్

గరిడేపల్లి, మార్చి 14 : పదో తరగతి చదువుతున్న విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ పి.చత్రూనాయక్ అన్నారు. స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, రాజమహేందర్, సత్యనారాయణ, ఖాజామోయినుద్దీన్, భాగ్యలక్ష్మి, మహేశ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేరేడుచర్ల : స్థానిక జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం బట్టు మధు, ఉపాధ్యాయులు నర్సకుమారి, సైదులు, రషీద్‌ఖాన్, శౌరి, వెంకటేశ్వర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, మాధవి, నర్సింహారావు, అన్నపూర్ణ, కల్యాణి పాల్గొన్నారు.

చిలుకూరు : చిలుకూరు జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పార్టీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర చట్టం అమలు చేయాలి

- సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు

బొడ్రాయిబజార్ : వాణిజ్యభవన్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు

బొడ్రాయిబజార్, మార్చి 14 : కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, రైతాంగ ఉద్యమం సందర్భంగా రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జున్‌రెడ్డి, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న రైతాంగ ఉద్యమానికి మద్దతుగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్యభవన్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాలకు అన్ని వర్గాల ప్రజలు సంఘీభావం తెలుపాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతాంగ ఉద్యమానికి మద్దతుగా నిలువాలి

దేశంలో రైతాంగం చేపడుతున్న ఉద్యమానికి మద్దతుగా నిలువాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. ఎస్‌కేఎం దేశవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం స్థానిక రైతు బజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సభ్యుడు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అకిల్‌కుమార్ పాల్గొన్నారు.

గరిడేపల్లి : ప్రధాని మోదీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై పోరాడాలని అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కార్యదర్శి మేకల కనకారావు అన్నారు. మండలంలోని వెలిదండ గ్రామంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. మోదీ ప్రభుత్వ ప్రజాకంటక పాలనకు దేశ ప్రజల చేతిలో ఓటమి తప్పదన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు కామళ్ల శ్రీను, అరుణోదయ జిల్లా నాయకుడు గండు నాగేశ్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు పోలీసుల కౌన్సెలింగ్

యువకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం

సూర్యాపేట సిటీ, మార్చి 14 : సూర్యాపేట జిల్లా కేంద్రంలో హారన్ మోతలు, ర్యాష్ డ్రైవింగ్‌తో హడలెత్తి పోతున్న 60 ఫీట్ల రోడ్డు, విద్యా సంస్థలు ఉన్న ప్రాంతాలపై పట్టణ ట్రాఫిక్, షీ టీమ్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం ఆధ్వర్యంలో గురువారం 60 ఫీట్ల రోడ్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ర్యాష్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్ చేస్తున్న పలువురి వాహనదారులను పట్టుకుని విచారించారు. కాగితాలు, లైసెన్స్‌లు లేకపోవడంతో పలు వాహనాలను స్టేషన్‌కు తరలించారు. అనంతరం ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, షీ టీమ్ కార్యాలయంలో షీ టీమ్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సదరు యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించి మాట్లాడారు. విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తే ఈవ్ టీజింగ్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది జాఫర్, యల్లారెడ్డి, శివరాం పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

గరిడేపల్లి : విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందజేస్తున్న దాత చంద్రయ్య

గరిడేపల్లి, మార్చి 14 : స్థానిక జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు ఆర్ఎంపీ మేకపోతుల చంద్రయ్య పరీక్షా ప్యాడ్లు, పెన్నులు సోమవారం అందజేశారు. అలాగే రాయినిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.సుధీర్‌కుమార్ పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎంఈఓ చత్రూనాయక్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతగిరి : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు కొల్లు రామతులసి పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. సమావేశంలో జీహెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా యొక్క క్లయింట్ అయిన షేక్ బోడల్, తండ్రి జమాల్ సాహెబ్, నివాసం కొమరబండ, కోదాడ టౌన్, కోదాడ మం॥, సూర్యాపేట జిల్లా గారి నుండి సంజాయిషీ పొంది సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని రిజిస్టార్ దస్తావేజు నెం.1573/2019 ద్వారా సోమిరెడ్డి విజయశేఖర్‌రెడ్డి, తండ్రి వెంకటరెడ్డి గారి నుండి కొనుగోలు చేసి ఆనాటి నుండి తమ సంపూర్ణ స్వాధీన యాజమాన్య హక్కు కలిగి వున్నారు. ఇట్టి దస్తావేజుకు లింకు దస్తావేజు నెంబరు 6572/2017 ఈ దస్తావేజుకు మూలాధారమైన ఒరిజినల్ లింకు దస్తావేజు నెంబర్లు5311/2013, 6242/2008 వీటిలో నుండి 5311/2013 మూలాధారమైన ఒరిజినల్ లింకు దస్తావేజు కోదాడలో జిరాక్స్ తీసుకునే సమయంలో పోయినవి. ఇట్టి డాక్యుమెంట్స్‌ను ఎంత వెతికినను లభించలేదు. ఇట్టి దస్తావేజులు నెం.6572/2017, 5311/2013లను నాయొక్క క్లయింట్ అయిన షేక్ బోడల్ గారు ఏదైనా బ్యాంకులకు గాని, ఆర్థిక సంస్థలకు గాని, వ్యక్తులకు గానీ, లీజు గాని ఏ విధమైన తాకట్టు గాని, కుదవ పెట్టడం గాని చేసియుండలేదు. ఎవరికైననూ ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల తెలియజేయగలరు. ఇట్టి షెడ్యూలు ఆస్తి ఈ క్రింది విధంగా ఉంది.

షెడ్యూలు ఆస్తి:

నల్లగొండ జిల్లా రిజిస్ట్రార్ గారి అధికార అజ్మాయిషికి లోనై యుండి కోదాడ సబ్ రిజిస్ట్రార్ గారి కార్యాలయ పరిధిలో ఉన్న కోదాడ మండలం, కొమరబండ గ్రామ పంచాయితీ & కొమరబండ గ్రామ రెవిన్యూ లిమిట్స్‌లో సర్వే నెం.193/1K, 193/1L, 193/1M, 193/1N, 193/1/E, 193/1/G & 193/1/H మిం.లె. భూమిలో ఏర్పాటు గావించబడిన ప్లాట్లలో నుంచి ప్లాట్ నెం.1 దాఖలా ఖాళీ స్థల విక్రయ విస్తీర్ణం చ.గ.122లకు సరియైన చ.మీ.101-992లకు హద్దులు:

ఉత్తరం: ప్లాట్ నెం.2 దాఖల స్థలం, దక్షిణం: అనంతు సైదయ్య వగైరాల భూమి, తూర్పు: ప్లాట్ నెం.20 దాఖలా స్థలం, పడమర: గ్రామ పంచాయితీ రోడ్డు,

అట్టి దస్తావేజుల ద్వారా ఎవరికైనా ఏ విధమైన హక్కులు సంక్రమించియున్న పక్షములో ఈ క్రింద తెలిపిన చిరునామాకి సంబంధిత ఆధార పత్రాలతో వారి యొక్క హక్కులు ఈ ప్రకటన వెలువడిన తేది నుండి వారం (3) రోజులలో తెలుపుకొనగలరు. దరిమిలా వచ్చిన ఆక్షేపణలు నాయొక్క క్లయింట్‌ను ఏ విధముగా కూడా బాధ్యులను చేయజాలవు. అభ్యంతరములు తెలియజేయవలసిన చిరునామా.

సం/- నాగుబండి కృష్ణమూర్తి
అడ్వకేట్
ఇం.నెం.3-199/1/సి, పబ్లిక్ క్లబ్ ఎదురుగా,
నయానగర్, కోదాడ-508206.
సూర్యాపేట జిల్లా, సెల్ నెం.9848256389

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

మేళ్లచెర్వు, మార్చి 14 : రోడ్డు ప్రమాదంలో రెండు రోజుల క్రితం గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం చౌటపల్లికి చెందిన తరుణ్ (21) ఈ నెల 11న మేళ్లచెర్వు జాతరను చూసేందుకు వచ్చాడు. అర్ధరాత్రి దాటాక మేళ్లచెర్వు ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న అతడిని ప్రమాదవశాత్తు ఓ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన తరుణ్‌ను చికిత్స కోసం తరలించగా బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం పోస్టుమార్టం అనంతరం నష్టపరిహారం ఇప్పించాలంటూ బంధువులు మృతదేహంతో నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారికి సర్దిచెప్పి నిరసన విరమింపజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పుస్తె మట్టెలు అందజేత

యువతికి మంగళసూత్రం, మట్టెలు అందజేస్తున్న సదాచార్ ట్రస్ట్ సభ్యులు

బొడ్రాయిబజార్, మార్చి 14 : తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామానికి చెందిన దివంగత గుడిపాటి రమేశ్ కుమార్తె అఖిల వివాహాన్ని పురస్కరించుకుని సదాచార్ ట్రస్ట్ కన్వీనర్ ఈగా దయాకర్ గుప్తా గురువారం యువతికి పుస్తె, మట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడి హిందుమతంలోని కుటుంబాలకు చెందిన వారు వివాహం చేసుకునే సమయంలో తమని సంప్రదిస్తే సాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మిర్యాల శివకుమార్, మిర్యాల కవిత, ఈగా విజయలక్ష్మి పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మఠంపల్లి, మార్చి 14 : అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను మఠంపల్లి మండల కేంద్రం సమీపంలో పట్టుకున్నట్లు ఎస్: ఎం.రామాంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిని దవనం పద్మ తెల్లవారుజామున 4:45 గంటలకు వాహనంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

సాగర్ నీటిని విడుదల చేయాలి : సీపీఎం

మేళ్లచెర్వు, మార్చి 14 : సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నట్లు చెప్పారు. వెంటనే సాగర్ నీటిని విడుదల చేసి చెరువులను నింపాలని పేర్కొన్నారు. ఆయన వెంట జానీ, ఎల్లయ్య ఉన్నారు.

పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలు

నూతనకల్, మార్చి 14 : మండలంలోని మాచనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగి ఇష్టానుసారం ప్రవర్తించారు. పాఠశాలను మద్యం సీసాలు, తినుబండారాలతో అపరిశుభ్రం చేశారు. చిన్నారులు విద్యాబుద్ధులు నేర్చుకునే పాఠశాలలో ఇలాంటి ఘటనలు జరుగడం శోచనీయమని గ్రామస్తులు అన్నారు. ఈ విషయమై ఎస్ఐ సైదులుకు ఫిర్యాదు చేసినట్లు హెచ్ఎం మేడిపల్లి శ్రీనివాస్ తెలిపారు.

గుండెపోటుతో ఆర్టీసీ సేవకుడు ముత్తయ్య మృతి



: ముత్తయ్య

తుంగతుర్తి, మార్చి 14 : టీఎస్ ఆర్టీసీ సేవకుడు, మండల కేంద్రానికి చెందిన మంగళపల్లి ముత్తయ్య (75) గుండెపోటుతో గురువారం మృతిచెందాడు. 20 ఏండ్లుగా ఆయన మండల కేంద్రంలోని బస్ స్టేషన్‌లో ప్రయాణికుల లగేజీ విషయంలో సేవలందిస్తూ, మరుగుదొడ్ల నిర్వహణ చూస్తున్నాడు. బస్టాండ్ ఆవరణలో ముత్తయ్య నాటిన పలు చెట్లు నేడు వృక్షాలుగా ఎదిగాయి. గతంలోనే భార్య చనిపోవడంతో ఓ బాబును సాదుకుంటూ పెంచి పెద్దవాడిని చేశాడు. ఉదార స్వభావం కలిగిన ముత్తయ్య మృతి పట్ల గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

సీఏఏను తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించాలి

- సీపీఐ నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, మార్చి 14 : కేంద్ర ప్రభుత్వం వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని(సీఏఏ) వెనక్కి తీసుకోవాలని, సీఏఏను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాల ధనుంజయ నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజలు సామరస్యంగా కలిసి జీవిస్తున్న ఈ దేశంలో ఇలాంటి చట్టాలు తీసురావడం సరి కాదన్నారు. కేరళ, తమిళనాడులో లాగా తెలంగాణలో కూడా సీఏఏ అమలు కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, పాలకవీడు మండల కార్యదర్శి ముళ్ల జానయ్య, రావుల సత్యం పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు

సమావేశంలో మాట్లాడుతున్న సైదులు

మఠంపల్లి, మార్చి 14 : ఉపాధి హామీ సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీపీఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నదని దుయ్యబట్టారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండూనాయక్, మండల కార్యదర్శి మాలోతు బాలూనాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు హుస్సేన్ పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి కేసులో ముగ్గురికి రిమాండ్

నాగారం, మార్చి 14 : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన కేసులో పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలు.. గత నెల 26న మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మట్టగజం అవిలయ్య తన పొలం వద్ద కరెంట్ షాక్‌కు గురై చనిపోయాడు. అతడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అనుమానితులు అవిలయ్య తమ్ముడు మట్టగజం మల్లయ్య, ఆయన రెండో కొడుకు మట్టగజం లక్ష్మణ్, అదే గ్రామానికి చెందిన బంధువు మట్టగజం సాయికుమార్‌ను విచారించారు. సోదరుల మధ్య పదేండ్లుగా భూములు, బోర్లు, ఇంటి స్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని మల్లయ్య మిగతా ఇద్దరితో కలిసి కరెంట్ మోటార్ వద్ద స్టార్టర్ బాక్స్‌కు వచ్చే సర్వీస్ వైర్లకు విద్యుత్ వైర్లు అమర్చగా అవిలయ్య విద్యుత్ వైర్లకు తగిలి చనిపోయినట్లు విచారణలో తేలింది. దాంతో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు నాగారం సర్కిల్ సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ పి.వెంకట్‌రెడ్డి తెలిపారు.

కారు ప్రమాదంలో వ్యక్తి మృతి

మద్దిరాల, మార్చి 14 : మండల కేంద్రం శివారులోని జాతీయ రహదారి 365పై గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్.ఎస్ మండలం పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన అనంత్‌రెడ్డి వ్యక్తిగత పనులపై గురువారం సాయంత్రం తన కారులో తుంగతుర్తికి బయల్దేరాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలానికి చెందిన సాయికిరణ్ హైదరాబాద్ నుంచి టేకులపల్లికి కారులో బయల్దేరాడు. మండల కేంద్రం శివారులోకి రాగానే రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో పాతర్లపహాడ్‌కు చెందిన అనంత్‌రెడ్డి కారులో చిక్కుకుని అక్కడికక్కడే మృతిచెందాడు. మరో కారులో ఉన్న సాయికిరణ్‌కు తీవ్రగాయాలయ్యాయి.

మాచిరెడ్డిపల్లెలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నాగారం, మార్చి 14 : మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులకు కాంగ్రెస్ నాయకుడు పసుపులేటి వెంకట్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలు, ఎంపీ నిధులు రూ.5 లక్షలతో రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జంపాల శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ వడ్డె మహేశ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగులు అందజేత

గరిడేపల్లిలో వెంకటయ్యకు గొడుగు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గరిడేపల్లి, మార్చి 14 : మండల కేంద్రంలో చెప్పులు కుట్టుకునే మేరిగ వెంకటయ్య, పానుగోడులో చిరు వ్యాపారం సాగిస్తున్న పల్లి అన్నమ్మకు లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో బుధవారం గొడుగులు అందజేశారు. కార్యక్రమంలో గరిడేపల్లి ఏఎస్ఐ రాములు, క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి జిలకర రామస్వామి, జీహెచ్ఎం సువర్ణ, మాజీ రీజినల్ చైర్మన్ సుందరి నాగయ్య, మాజీ అధ్యక్షుడు కందిబండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సాయం అభినందనీయం

- కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మాధవి



ఎల్ఈడీ టీవీ అందిస్తున్న హారిక కుటుంబ సభ్యులు

నూతనకల్, మార్చి 14 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మాదవి అన్నారు. బుధవారం ఆ పాఠశాలలో సీఆర్‌టీగా పని చేస్తున్న హారిక కుటుంబ సభ్యులు సుమారు రూ.1 లక్ష విలువజేసే ఎల్ఈడీ టీవీ, సౌండ్ సిస్టమ్, ఫ్యాన్లు, బాత్ రూమ్ డోర్లు తదితర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME

I, PARLA AMAR S/o. PARLA RAJALINGAM H.No.6-2-626/10 Sri Sai Residency Sri Nagar Colony, Nalgonda Town and District. Telangana State Pin: 508001, Have change my name to PERLA AMAR, S/o.PERLA RAJALINGAM (New Name).

కావలెను

TS RTC కోదాడ మరియు మిర్యాలగూడ డిపోలలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఎలక్ట్రీషియన్ మరియు వెల్డర్ కావలెను. అర్హత టెన్త్ క్లాస్ మరియు ఐటిఐ, జీతం+EPF and ESI కలదు. Cell: 7730805327.

NLG-

FLAT FOR SALE

★Ready to Move: Hayathnagar Near Vijayawada Highway Beside Bus Stop Sup. Luxurious 3BHK Flats, 2 Side 30' Rd. Ph: 9247326642 / 9849801477.
NT-327957

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777196	చౌటుప్పల్ : 9182777638